# దుమ్ములగొండె

[కథానిక]

= శ్రీ చాగంటి సోమయాజులు =

చెడ్డతొందరగా అడుగులు పడ్డాయి. సైనికుల్లాగ చకచక నడుస్తున్నాము. కంకర ఎక్కపెట్టిన రోడ్డుమీద 'మణ్యాం' ఆకుజోళ్లు టపకటపకా ఎగురుతున్నాయి. గిరిరావు బూట్లు ఇనపనాళ్ల నాదంతో మెట్లంగిరాళ్లని మోగిస్తున్నాయి. నాకు జోళ్లు లేవు. నా అరికాళ్లు చెప్పుజోళ్లకన్నా బలమైనవి. వేళ్లకి దెబ్బలు తగలకండా నిపుణతతో అడుగులు వెయ్యడం నాకాళ్లకి తెలుసు. ఎక్కపెట్టిన రాళ్లని నాకాళ్లు కళ్లున్నట్టు తప్పించుకోగలవు. ఎంత కర్కశంగా మార్గమున్నా కాళ్లకి ఇబ్బంది లేదు. మిట్టమధ్యాహ్నపు తారురోడ్డు దోసెల రేకులాగ వేడెక్కి నూనెకక్కుతూ ఆవిరులొస్తున్నా నాఅరికాళ్లు భరిస్తాయి. నానడకతొందరకి భూమి అదురుతున్నాది.

ముగ్గురం ఒక్కలాగ అడుగులు వేస్తూ ఒక్కబిగిని ఒకరికి ఒకరం తీసిపోకండా నడుస్తున్నాం. బూట్ల నాదం మద్దెల మోతలాగుంది. ఆకుజోళ్లు తాళం వేస్తున్నట్టున్నాయి. నాకాళ్లు సన్నని శ్రుతిలాగ పడుతున్నాయి. మూడూ ఒక్క శ్రుతిలో మిళితం అవుతున్నాయి.

మాట్లాడకండా వూపిరి బిగపెడుతూ నడుస్తున్నాము. అర్ధరాత్రి. కోటలో గంట ఠంగుమని కొండలమధ్య కొచ్చి మారుమోగింది. వెన్నెల కర్పూరంలాగ వెలుగుతున్నాది. సాయంకాలం పెద్ద వర్షం కురవడాన్ని ఆకాశం నిర్మలంగా ఉన్నాది. మచ్చకొండ, సూదికొండ, దుప్పులకొండా అభ్యంగనం చేసుకొని నీటుగా లేడీల్లాగ మఠాలు వేసు క్కూచున్నాయి.

కుమిలిఘాటీకి మాఅర్ధరాత్రిషికారు. ఘాటీమీద నూతికి దిగే మెట్లమీద కూర్చుంటే కోనాడసముద్రతీరందాకా కనబడే విశాల దృశ్యాన్ని వెన్నెట్లో చూస్తూ ముగ్గురం కుచ్చిటప్పాలతో జాగరం చేస్తాం. భయంకరమైన ఏకాంతసీమలో సుందరజాగరం.

నల్లని నీడలో గోతిడునీళ్లు వెన్నెలపడి తెల్లగా చెంగల్వపువ్వులాగ వికసించాయి. రోడ్డువార కాలువలో నక్షత్రాలు మాకన్నా వడిగా పరిగెడుతున్నాయి. గుండ్రపటి గోతినీట్లో నక్షత్రాలు గోతినిండా గడ్డిపువ్వుల్లాగ ఉన్నాయి. గెడ్డలో నీళ్లు పారడం లేదు. కాని వర్షానికి నాని గెడ్డలో ఇసక జిమజిమలాడుతున్నాది. చెమ్మమీద చంద్రకాంతి పడి గెడ్డ జిగ్గని తెల్లజరీచీరలాగ మెరిసిపోయింది.

చుట్టూ కొండలు వలయంగా చుట్టేశాయి. ఆమధ్య నున్న భూస్థలం గంగాళంలాగున్నాది. కప్ప లరుస్తున్నాయి. ఎన్ని కప్పలరుస్తున్నాయి! అర్బుదాలు నిర్బుదాలు అరుస్తున్నాయి. దగ్గరలో ఉన్న కప్ప టాంకు టాంకు మంటున్నాది. మానడకతొందర కదివెనకపడిపోయింది. మాముందు ఇంకొక కప్ప అరుస్తున్నాది. అన్నికప్పలకన్నా దాని అరుపులో ఏదో ప్రత్యేకత గోచరమౌతున్నాది. కాని అది మేళంతో కలిసి ఎంతోసేపు పాడలేదు. అకస్మాత్తుగా ఊరుకొంది. కప్పల ఆర్కెస్ట్రా మొత్తంమీద ఉద్భవంచేస్తున్న 'హార్మొనీ' వింటూ నడుస్తున్నాను. గంగాళంలాంటి భూవలయంలో కళపెళ ఎసరు ఉడుకుతున్నట్టు కప్పలు మోతపెడుతున్నాయి. దిగంతాల్లోంచి ఏదో తొణికిపోతున్నట్టు కప్పల మోత తిరగబడుతున్నాది.

తుల్లిపడి వెనక్కి చూశాను. వొళ్లంతా పులకరించింది. నాచెవులకి స్పష్టంగా గాజుల నిక్వాణం వినపడ్డాది. నర్తకి గుల్లకడియాల్లో రాళ్ల గుణగుణ వినబడ్డాది. మావెనకాతల ఏఅప్సరసలూ రావడం లేదు. ఆ భ్రమని కలిగించింది కీటకగానం. కీటకాలు కోటానుకోట్లు తంత్రీస్వనాలు మీటుతున్నాయి. కప్పల మోత గంభీరంగా వినబడుతున్నాది. కీటకగానం వీణానిక్వాణాల్లాగ సహస్రతంత్రుల మీంచి వినబడుతున్నాది. మానడకకి కప్పల మోత మిలిటరీబేండు. కీటకాలమోత నా హృదయంలో మధురరసాన్ని ఊరిస్తూ అప్సరసల్ని కళ్లెదటికి తీసుకొస్తున్నాది. నాకెదురుగా దెయ్యాల్లాగ జుత్తులు విరగబోసుకొని ఈతలు నడుచుకొస్తున్నాయి. కాని నాఎదట రంగస్థలం విద్యుద్దీపాలతో ఉజ్వలిస్తున్నాది. దాంట్లో నటీనటులు మధురరస ప్రధానమైన భరతనాటిక నటిస్తున్నారు. మువ్వలు మోతపెడుతున్నాయి. వెండి మువ్వలు, గాజులు గలగల్లాడుతున్నాయి. గోటులూ, దిల్‌రుబాలూ, సారంగులూ, చితారులూ సహస్రతంత్రులతో మోగుతున్నాయి. గట్టిగా పాడ్డానికి ప్రారంభించాను.

"గోపీపీనపయోధర.........."

"షటప్" (Shut up) అన్నాడు గిరిరావు.

"నేను పాడుకుంటే నీకేం ?" అన్నాను.

"ఘాటీ ఎక్కేదాకా నోరు కదపడానికి వీలులేదనుకొన్నాము" అన్నాడు మణ్యాం. నిజమే.

"మీతో సరిగ్గా అడుగువెయ్యలేక పోతేకదా ?" అన్నాను.

"నో" అన్నాడు గిరిరావు.

కొండలలోంచి ధీరసమీరం శీతలంగా వీచడం ప్రారంభించింది. చెట్లలోంచి ముత్యాలు రాలుతున్నాయి. వనమాలిని ఉద్దేశించి హాయిగా పాడుకోనిచ్చారు కాదు.

నాగొంతుకలో పాట ఆగిపోయింది. నా నుదురుమీంచి, ముక్కుమీంచి పెదిమ మీదికి జారి ఘర్మసలిలం ఉప్పగా పడ్డాది. తడిసిపోయిన చొక్కాలోంచి సమీరం వెళ్లి నా త్వగింద్రియానికి చల్లగా చక్కిలిగింత పెడుతున్నాది. నాకళ్లెదట రంగస్థలం, నాట్యమండలి మాయమైపోయాయి.

మాకు దగ్గరలోనే నిలబడి నక్క చూస్తున్నాది. నక్క నిలబడి నిర్భయంగా

చూస్తుంది. ప్రమాదం దగ్గిరకొచ్చిందంటేనే తోకముడిచి పరుగెడుతుంది. లేకపోతే మనల్ని నిబ్బరంగా నిలబడి మోరెత్తి చూస్తూ 'నువ్వేమి చేస్తావు?' అని ప్రశ్నిస్తుంది. నక్కని చూస్తే నాకు కుమిలిఘాటీకథ వొకటి జ్ఞాపకమొచ్చింది. ఆకథ గిరిరావుకీ తెలుసు.

"మణ్యాం, అదిగో దుమ్ములగొండె" అన్నాను.

"సీతలకాయ" అన్నాడు మణ్యాం.

"అదిగో చూడు" అని చూపించాను.

"నక్క" అన్నాడు గిరిరావు.

"ఇంకోటికూడా వెనకాతల ఉన్నాది" అన్నాడు మణ్యాం. నక్కదంపతులు వాహ్యాళికొచ్చారు.

"దాసు వీటిని చూచేకాబోలు పారుకొన్నాడు" అన్నాను.

"అంతే అయిఉంటుంది" అన్నాడు గిరిరావు.

"ఏదాసు?" అనడిగాడు మణ్యాం.

"దుక్కణ్ణి ఎరగవూ? కాళిదాసు." అన్నాను.

"వాడు! ఎందుకు పారుకొన్నాడు?" అనడిగాడు మణ్యాం.

"ఇక్కడే. సైకిలుమీద కొండవొడ్డుదాకా షైరు వెళ్లేట్ట. సాయంకాలం. దుమ్ములగొండె కనబడ్డాదిట. అక్కణ్ణుంచి సైకిలు వెనక్కి తిప్పి ఇంటికి వొచ్చి చలికిల్లా పడ్డాడు. వాడికి ప్రాణాలు లేవు" అన్నాను.

"పిరికివాడన్నమాట" అన్నాడు మణ్యాం.

"పట్టపగలు దెయ్యమంటే జడుసుకొంటాడు" అన్నాడు గిరిరావు.

"రామరామ" అన్నాడు మణ్యాం.

"అదేమన్నమాటలే. ఇక్కడ చిరతపులులు లేకపోయినా పెద్దనక్క, దుమ్ములగొండె ఉన్నమాట వాస్తవం" అన్నాను.

"లేవురా" అన్నాడు గిరిరావు.

"మంచివాడివి. దాసన్న పేటగొల్లవాళ్ల నడుగు. దుమ్ములగొండె పెయ్యని ఎత్తుకుపోయిందో లేదో. ఎప్పుడూ ఈకొండని ఉండదుకాని వెలగాడకొండమీంచి అప్పటప్పట వొస్తూఉంటుంది." అన్నాను.

"నలుగురుంటే ఏం చేస్తుందిలే" అన్నాడు గిరిరావు.

మణ్యాం నవ్వేడు. గట్టిగా, హేళనగా నవ్వేడు. మణ్యాంది విజయనగరం కాదు. మాకొండలని ఏజంతువూ లేదనే వాడి నిబ్బరం. కాని దుమ్ములగొండె ఉందనే—నేనెప్పుడూ చూడకపోయినా — అంతా అంటారు.

నాకు బితుకు పట్టుకొంది. బండరాళ్లన్నీ దుమ్ములగొండెల్లాగ కనబడ్డం మొదలెట్టేయి. మానడకజోరు తగ్గలేదు. రాళ్లన్నీ జంతువుల్లాగ కదులుతున్నాయి. ఒక రాయిని చూచి జంతువనే నిర్ధారణ చేసుకొన్నాను. దాని నడ్డీ, మూతీ గాడిదఆకారంలోనే కనబడ్డాయి. తేరిపారిచూస్తే మహావికృతమైన దుమ్ములగొండిస్వరూపం కనబడ్డాది. ఒక్కఅడుగు ఆగి చూస్తే రెండు రాళ్లు కనబడ్డాయి. కాని రాళ్లన్నీ దుమ్ములగొండెల్లాగ కనబడుతున్నాయి.

నాపిరికితనానికి నాకే నవ్వొచ్చింది. ఇదివర కెన్నిసార్లు ఘాటీకి వెన్నెలరాత్రిళ్లలో

వెళ్ళలేదు? చిన్నప్పణ్ణుంచీ అవకతవకస్థలాలకి స్నేహితులతో షైర్లు పోయిన నక్తంచరుణ్ణే!

అదేదో వృక్షం-పేరు మరిచిపోయాను-కనబడ్డాది. బగ్గిలుబగ్గిలుగా మెరుస్తూ తెల్లని బెరడుతో ఆమానుకొమ్మలు వెన్నెట్లోకి భయంకరంగా లేచిఉన్నాయి. ఆవృక్షము కిందే నలమహారాజుకి శనిదేవత ఆవహించిందిట. ఆకారణంచేత ఆచెట్టుకిందికి మనం వెళ్ళకూడ దని నిషేధం ఉన్నాది. పిచ్చి నిషేధం!

మామిడితోట్లో కెళ్లాము. చీకటిగా ఉన్నాది. రోడ్డునిండా మామిడిచెట్లు ఆవరించిఉన్నాయి. అంచేత రోడ్డంతా తివాసీలు పరిచినట్టు నీడలున్నాయి. నీడల అందాన్ని చూచి నేను ముగ్ధుడనౌతాను. మావీథిమెట్ల మీాద కూచుని వాకట్లో పెద్ద పువ్వులాగ పడ్డ కొబ్బరిచెట్టు నీడనీ, గోడమీాద రంగవల్లికలుగా ఏర్పాటుఅయిన తుప్పల నీడలనీ చూసి ఆనందిస్తూ రాత్రి రెండు మూడు గంటలదాకా సిగరెట్లు కాలుస్తూ కూర్చున్న రోజు లున్నాయి. కాని మామిడితోటలో రోడ్డుమీాది నీడలన్నీ మచ్చల మెకాల్లాగున్నాయి. గుండె కొట్టుకొంది.

కింకిణీస్వనం లంకిణీదేవి గుర్రులాగుంది. కప్పల ఆర్కెస్ట్రా కొండదేవతబలికి నరులని తీసుకుపోతున్న కిరాతుల డోలు వాయిద్య మైపోయింది.

నామీాద దెయ్యంలాగ భయం ఆవహిస్తున్నాది. మేకపోతు గాంభీర్యంతో ముందుకి అడుగులు వేస్తున్నాను. కాని గుండె జారిపోతున్నాది. శరీరంలో రక్తం, మాంసం, ఎముకలూ మాయమైపోతున్నాయి. శరీరం గుల్లతేరిపోయి ఆఖాళీనిండా భయం నిండిపోతున్నాది.

మణ్యంకి పిసరు భయం కలగలేదు. చెక్కు-చెదరకండా అడుగులు వేస్తున్నాడు. నా అడుగులు తడబడుతున్నాయి. శని వృక్షముకిందికి వొచ్చాము. తెల్లని పొలుసులు పేలిన బెరడుతో దాని కొమ్మలు ఆకాశంలోకి తలలెత్తి కనబడ్డాయి.

ఘాటీనందు చీకటిగా కబంధుడి అంగుడులా గుంది. ఘాటీమీాదికి తోవతీసుకుపోతున్నాది. సూదికొండ కబంధుడి అంగుట్లో కొండనాలికలా గుంది. లోపలకి వెళ్లుతున్నకొద్దీ కబంధుడు బారలు జాచి నోట్లోకి మమ్మలిని లాక్కు-పోతున్న ట్టున్నాది.

“ఒరే, గిరిరావ్, ఇప్పుడు ఈ గోతుల్లో నీళ్లు తాగడానికి దుమ్ములగొండె నిజంగా వొస్తే మన మేమి చెయ్యగలం?” అని ప్రశ్నించాను. గిరిరావు స్థలజ్ఞుడు. ఆప్రశ్నతో అతనికీ నాభయం అంటువ్యాధిలాగ తగులుకొన్నాది.

“ఏమిటి చేస్తాం?” అని తిరిగి ప్రశ్నించాడు గిరిరావు.

“మనదగ్గర కర్రయినా లేదుకదా, మీాదికొస్తే ఏమి చేయగలం?” అని తిరిగి ప్రశ్నించాను.

“కలియబడదాం” అన్నాడు మణ్యం. అతనికి నవ్వుతాలుగా ఉన్నాది. నాకు నవనాళ్లూ తోడుకుపోతున్నాయి.

“హాస్యంకాదురోయ్. ఈ స్థలాలు మంచివి కావు. ఏమి చెయ్యగలం?” అని ప్రశ్నించాను.

“గట్టిగా కేకేస్తే హడలెత్తి పారి

పోతుంది. దాన్ని చూచి మన మెంత భయపడతామో అదీ మనల్ని చూచి అంతా భయపడుతుంది." అన్నాడు మణ్యం. వాడికింకా నవ్వుతాలుగా ఉన్నాది. గిరిరావు ఆలోచనలో పడ్డాడు. రాళ్ల రోడ్డు ఘాటీ మీదికి లేస్తున్నాది. శరీరాన్ని ఎత్తుకు మోసుకొని వెళ్లడానికి కాళ్లు లొటలొట లాడుతున్నాయి. గిరిరావు అడుగువెయ్యడం మానేశాడు. నేనూ నిలబడిపోయాను.

"ఘాటీకి వెళ్లడం ప్రమాదమే" అన్నాను.

"ప్రమాదమే" అన్నాడు గిరిరావు.

నన్ను భయం పూర్తిగా వశంచేసుకొంది. శరీరాన్నంతా ఆవహించింది. భయం శరీరాన్నంతా ఆవహించడం అందరి అనుభవంలోనూ ఉండదు. సాధారణంగా భయం గుండెల్లో ఒక భాగాన్ని మాత్రమే పట్టుకొంటుంది. ఇంకోభాగం ధైర్యాన్ని ఉపాసనచేసి భయపిశాచిని గెంటేస్తుంది. పిచికని పట్టుకుని పావుగంట చేతులో ఉంచి చూడండి అది చచ్చి ఊరుకుంటుంది. దాని గుండెలు భయంచేత ఆగిపోతాయి. భయం అంటే అదీ. అదీ నన్ను ఆవహించింది.

"వెనక్కిపోదాం" అన్నాను. భయం అంటువ్యాధి. ఈవ్యాధి క్రిమిసంపర్కం లేకండానే పక్కవాడికికూడా వ్యాపిస్తుంది.

"పోదాం" అన్నాడు గిరిరావు.

కాళ్లు ముందుకు పడలేదు. కాళ్లకి శిలలు కట్టినట్టు నిలబడ్డ చోట నిలబడిపోయాము. శరీరం ఏనుగంత బరువెక్కిపోయింది. శరీరం నిండా నిండి వేలకొద్దీ టన్నుల బరువుతో భయం ఆవహించిఉన్నాది.

"నాకాలు మరి ముందుకు పడ్డం లేదు" అన్నాను.

"నాదీనీ" అన్నాడు గిరిరావు.

"నిజంగా?" అన్నాడు మణ్యం.

"నిజంరా బాబూ - పదా" అన్నాను. మణ్యాన్నికూడా భయం పట్టుకొంది. వాడికి భయం మామ్మూలుగా పట్టుకోలేదు.

"అమ్మో" అని పెద్ద కేక వేసి వెనక్కి తిరిగేడు. తారకమంటుకొంది.

"ఎందుకేనా మంచిది, రాళ్లు పట్టుకొండి" అన్నాడు గిరిరావు. రెండు చేతులా అందరం రాళ్లు ఏరి పట్టుకొన్నాం.

భయం గెంటీడం మొదలెట్టింది. కాళ్లు ఎంత తొందరగా పడుతున్నాయో తెలియదు. ఘాటీమీంచి దిగడాని కేముంది? అంతా దిగుడు. ఐదు నిమిషాలైనా అయిందో లేదో సీతాఫలంతోటా, దానిమధ్యనుండి పోయే కొండవాగులో ఇనకా చేరుకొన్నాం. తోటలో రెల్లివాళ్ల పాకా, దూరంగా కళ్లాలలో కనబడ్డాయి. మనుషుల అలికిడి, పశువుల సవ్వడి అయింది. "ఛీఛీ" అన్నాను. నామీద నాకు అసహ్యం వేసింది. అంత పిరికితనం పట్టుకుం దేం? లజ్జ వేసింది.

బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. కాని ధీరసమీరం ఇంకా వీస్తున్నాది. నా చంక తిమ్మిరెక్కింది. అప్పుడు నాకు జ్ఞాపకాని కొచ్చింది. చంకలో అణిచిపెట్టి టీఫ్లేస్కు ఉన్నాది.

"టీ తాగుదాం" అన్నాను.

"చల్లబడనీ" అన్నాడు గిరిరావు.

నల్లచెరువుమెట్లల్లో బండరాయి ఎక్కి చతికిల్లా పడ్డాం. టీ తాగి రాత్రి అక్కడే పడుకొన్నాం. తెల్లవారుఝామున నక్కల అరుపులతో లేచాము. అరుణోదయ మౌతున్నాది. కాని కుమిలికొండలు అరుణోదయాన్ని అడ్డేస్తున్నాయి.

ఇంకా ధీరసమీరం వీస్తున్నాది. కాని యమునాతీరం, వనమాలీ, చంచల కరద్వయం ఆనాడు మరి కనబడలేదు. కుమిలిఘాటీ మీది ఏకాంతంలో సోపానాలు, వెన్నెట్లో మనోజ్ఞంగా కోనాడ సముద్రతీరందాకా కనబడే విశాలదృశ్యం, సర్పంలాగ మెలికలు తిరిగి మెరిసిపోతూ కనబడే చంపావతీనదీ చూసి అనుభవానికి తెచ్చుకొనే అవకాశం ఆ రాత్రి లేకపోయింది.

కాని ఆనాటి దుమ్ముగొండ అనుభవం జీవితంలో ఘనమైన భ్రాంతిమదలంకారము.

---

